వైద్యులను అభినందిస్తున్న డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

నిమ్స్‌లో వంద రోబోటిక్ సర్జరీలు

- ఆర్నెల్లలోనే శతక రికార్డు

ఖైరతాబాద్, జనవరి 12: నిమ్స్ దవాఖాన మరో మైలురాయిని అందుకున్నది. ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానలకు దీటుగా ఆధునిక చికిత్సలు చేస్తున్న నిమ్స్ రోబోటిక్ సర్జరీల విభాగం.. వంద రోబోటిక్ సర్జరీలు చేసి రికార్డు సృష్టించింది. ఈ శస్త్రచికిత్సలన్నీ ఆరు నెలల కాలంలోనే చేయటం మరో రికార్డు. అందులో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ (35), యూరాలజీ (48), సర్జికల్ ఆంకాలజీ (17) ఉన్నాయి. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప.. వైద్యుల బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో యూరాలజీ వైద్యులు ప్రొఫెసర్ రాహుల్ దేవ్‌రాజ్, ప్రొఫెసర్ రాంరెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ వర్మ, అనస్థీషియా ప్రొఫెసర్ నిర్మల, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ సర్కారు ఫలమిది

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చొరవతో గత ఏడాది రూ.32 కోట్లతో రోబోటిక్ సర్జరీ విభాగాన్ని నిమ్స్ దవాఖానలో ఏర్పాటు చేసింది. అందుకోసం 20 మంది సర్జర్లకు శిక్షణ ఇప్పించింది. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, యూరాలజీ, ఆంకాలజీ, విభాగాల్లో రోబోటిక్ సర్జరీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ చికిత్సలతో సమయం ఆదా అవటమే కాకుండా, కచ్చితమైన పరిష్కారం లభిస్తుంది.



అపోలో వైద్యులు చేపట్టిన పీఎస్ఏ అధ్యయనాన్ని వెల్లడిస్తున్న సంగీతారెడ్డి

యుక్త వయసులోనూ ప్రోస్టేట్ క్యాన్సర్

- 40 ఏండ్లలోపు పురుషులు జాగ్రత్త
- రక్త పరీక్ష ద్వారా క్యాన్సర్ గుర్తింపు
- 'అపోలో' అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): పురుషుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ చాపకింద నీరులా పెరుగుతున్నది. దీని నిర్ధారణ కోసం నిర్వహించే పీఎస్ఏ (ప్రోస్టేట్ స్పెసిఫికేషన్ యాంటిజన్ పరీక్ష) ప్రమాణాలే దీనికి కారణమని అపోలో వైద్యులు పేర్కొంటున్నారు.అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చితే భారతీయ పురుషుల్లోని పీఎస్ఏ ప్రమాణాల్లో తేడా కనిపించినట్టు వెల్లడైందని అపోలో జాయింట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. శుక్రవారం జూబ్లీహిల్స్ అపోలోలో మీడియాతో మాట్లాడుతూ.. పీఎస్ఏ అనే వైద్యపరీక్ష ప్రోస్టేట్ క్యాన్సర్‌కు ముందస్తుగా రోగనిర్ధారణ, చికిత్స పర్యవేక్షణకు నిర్వహిస్తారన్నారు. అమెరికా అధ్యయనం ఆధారంగా రూపొందించిన అంతర్జాతీయ నిబంధనలనే పాటించామని వెల్లడించారు. అయితే, పాశ్చాత్య పీఎస్ఏ ప్రమాణాలు భారత ప్రమాణాలకు సరిపోవని తెలిపారు. అపోలో వైద్యులు లక్ష మంది పురుషుల పీఎస్ఏల పరీక్షలు జరిపి, వాటి ఫలితాలను విశ్లేషించగా అంతర్జాతీయ, భారత పీఎస్ఏ ప్రమాణాల్లో వ్యత్యాసం కనిపించిందని వివరించారు. దేశంలోని 40 ఏండ్లలోపు వారికీ ప్రోస్టేట్ క్యాన్సర్ ముప్పు ఉన్నదని వెల్లడించారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ ప్రమాణాలు పాటించటం వల్ల చాలా మంది రోగులు వ్యాధి ముదిరిన దశకు చేరుకుంటున్నారని పేర్కొన్నారు. అపోలో హాస్పిటల్ కన్సల్టెంట్ యూరో-అంకాలజిస్ట్ ప్రొఫెసర్ సంజయ్ అడ్డాల పాల్గొన్నారు.

పీఎస్ఏ స్థాయిలు ఇలా..

వయసు	అంతర్జాతీయ ప్రమాణాలు	దేశీయ ప్రమాణాలు (తాజాఅధ్యయనం)
< 40 ఏండ్లు	వర్తించవు	< 1.4
41-50	< 2.5	< 1.7
51-60	< 3.5	< 3.1
61-70	< 4.5	< 5.8
71-80	< 6.5	< 8.82
> 80	వర్తించవు	< 11.3

చాక్లెట్ పేపర్‌లో 6 కోట్ల విలువైన వజ్రాలు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడిన డైమండ్స్

- ఎయిర్‌పోర్టులో ఇద్దరి నుంచి స్వాధీనం

శంషాబాద్ రూరల్, జనవరి 12 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.6 కోట్ల విలువైన వజ్రాలను శుక్రవారం డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. దుబాయ్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఇద్దరు ప్రయాణికులు వజ్రాలను చాక్లెట్ పేపర్లలో చుట్టుకొని వచ్చినట్టు డీఆర్ఐ అధికారుల తనిఖీల్లో బయటపడింది. ఈ వజ్రాల విలువ రూ.6 కోట్ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జీవో 55 రద్దు చేయాల్సిందే

- హైకోర్టుకు యూనివర్సిటీ భూములు ఇవ్వొద్దు
- ప్రభుత్వం నిర్ణయం మార్చుకొనేవరకూ ఉద్యమం
- తేల్చి చెప్పిన అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థులు
- ఐదో రోజు చెట్లకు పూజలు చేసి వినూత్న నిరసన

జీవో 55కు వ్యతిరేకంగా అశ్వారావుపేటలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

వీయ్ వాంట్ జస్టిస్

వ్యవసాయ యూనివర్సిటీ/అశ్వారావుపేట, జనవరి 12 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు ఇవ్వొద్దని, సంబంధిత జీవో 55 విరమించేవరకూ ఉద్యమిస్తామని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ విద్యార్థులు తేల్చిచెప్పారు. శుక్రవారం ఐదోరోజు ఉదయంనుంచే వర్సిటీ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. తరగతులను బహిష్కరించి, బయోడైవర్సిటీ క్షేత్రానికి ర్యాలీగా తరలివెళ్లారు. పాలు, నీళ్లతో కడిగి కుంకుమ, పసుపుతో చెట్లకు పూజలు చేశారు. వంటావార్పు నిర్వహించి, బతుకమ్మ ఆడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. సేవ్ ది యూనివర్సిటీ ల్యాండ్స్, సేవ్ ఫార్మర్స్, స్టూడెంట్ పవర్.. నేషనల్ పవర్ అంటూ నినదించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతున్నా.. ప్రభుత్వం మాత్రం ఒంటెద్దు పోకడలు పోతున్నదని మండిపడ్డారు. ఈ పరిధిలో హైకోర్టును నిర్మించడంవల్ల పర్యావరణం, వ్యవసాయ పరిశోధనలు, జీవ వైవిధ్యానికి ప్రమాదం పొంచి ఉన్నదని తెలిపారు. రైతు కుటుంబం, గ్రామీణ ప్రాంతంనుంచి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి వ్యవసాయ యూనివర్సిటీ విలువ తెలియకపోవడం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. ఇక్కడ దాదాపు 40 ఏండ్లకు పైగా వర్సిటీ, అనుబంధ సంస్థలు కొనసాగుతున్నాయని, అనేక పరిశోధనలు, వేలాది మంది వ్యవసాయ విద్యార్థులకు, ప్రధానంగా రాష్ట్ర రైతాంగానికి ఈ యూనివర్సిటీ అండగా ఉన్నదని వెల్లడించారు. మాజీ సీఎం రోశయ్య 2008లో బయోడైవర్సిటీ పార్కును ఏర్పాటు చేసి, దీన్ని మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని సూచించినట్టు గుర్తుచేశారు. నిరసనలో విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీచందర్ రెడ్డి, వినయ్‌రెడ్డి, బాలకోటినాయక్, శంకర్‌నాయక్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో కదంతొక్కిన విద్యార్థులు

అగ్రికల్చర్ యూనివర్సిటీకి చెందిన 100 ఎకరాల భూమిని హైకోర్టుకు కేటాయిస్తూ జారీ చేసిన 55 జీవోను వెంటనే రద్దు చేయాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం భోజన విరామ సమయంలో వ్యవసాయ కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. తొలుత కళాశాల ప్రాంగణం నుంచి జాతీయ రహదారి వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే జీవో 55ను రద్దు చేయకుంటే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఎద్దును చంపిందని పులి హతం

- పీడిన పెద్దపులి మృతి మిస్టరీ
- ముగ్గురు నిందితుల గుర్తింపు
- విషప్రయోగం చేసినట్టు అంగీకారం
- వివరాలు వెల్లడించిన డీఎఫ్‌వో
- ఇద్దరికి 12 రోజుల జుడీషియల్ కస్టడీ
- పేరెంటల్ బాండ్‌పై మైనర్ విడుదల

కాగజ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టేబ్రీవాల్

మంచిర్యాల, జనవరి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో పులి మృత్యువాత మిస్టరీని అధికారులు ఛేదించారు. ఎద్దును చంపిందన్న కోపంతోనే నిందితులు పులిని చంపేసినట్టు గుర్తించారు. ఇందుకు కారణమైన ముగ్గురిని కోర్టులో హాజరు పరిచారు. విషం చల్లిన పశువు కళేబరాన్ని తినడంతోనే పులి చనిపోయిందని విచారణలో నిందితులు అంగీకరించినట్టు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. వాంకిడి మండలం వెల్లి పంచాయతీ పరిధిలోని రెంగరీట్ గ్రామానికి చెందిన కోవా గంగు, ఆత్రం జల్‌పతితోపాటు ఓ బాలుడు(11) విషప్రయోగం చేసిన వారిలో ఉన్నట్టు తెలిపారు. ఆసిఫాబాద్ డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టేబ్రీవాల్ శుక్రవారం కాగజ్‌నగర్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. కాగజ్‌నగర్ రేంజ్‌లోని దరిగాం బీట్‌లో ఈ నెల 8న అనుమానాస్పదరీతిలో మగ పులి మృతిచెందిన ఘటనపై విచారణ చేశామని తెలిపారు. పులిని చంపాలనే ఉద్దేశంతోనే పశువు కళేబరంపై విషం చల్లామని నిందితులు ఒప్పుకొన్నారని, ఆధారాలను సైతం సేకరించామని చెప్పారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు. వీరిలో కోవా గంగు, ఆత్రం జలపతికి కోర్టు 12 రోజుల జుడీషియల్ కస్టడీ విధించిందని, బాలుడిన పేరెంటల్ బాండ్‌పై రిలీజ్ (అధికారుల విచారణ కోసం ఎప్పుడు పిలిచినా రావాలి, కోర్టు తుది తీర్పునకు కట్టుబడి ఉండాలి) చేసిందని తెలిపారు. దీనిపై విచారణ కొనసాగుతుందని, పూర్తిస్థాయి సమాచారం తర్వాత వెల్లడిస్తామని చెప్పారు. కాగా, విషం తిన్నట్టు అనుమానిస్తున్న మిగిలిన పులులతోపాటు కనిపించకుండా పోయిన పులుల ఆచూకీ కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు మూడు పులుల పాద ముద్రలను గుర్తించామని తెలిపారు. అయితే, ఆ పులుల ఆచూకీ సీసీ కెమెరాల్లోగానీ లైవ్ కెమెరాల్లో గానీ ఎక్కడా రికార్డు కాలేదని వెల్లడించారు. మూడో రోజు సైతం అడవిలో పులుల జాడ కోసం వెతికినట్టు చెప్పారు. 120 మంది సిబ్బందితో కూడిన 24 బృందాలు అడవులను జల్లెడ పట్టినట్టు పేర్కొన్నారు.

ఎద్దును చంపిందన్న కోపంతోనే..

విచారణలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పులి తమ ఎద్దును చంపిందన్న కోపంతో నిందితులు విషం పెట్టి పులిని హతమార్చినారని తెలిసింది. ఇటీవల కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో పులుల సంచారం పెరిగింది. ఈ క్రమంలో తరచుగా పాడిపశువులపై దాడి చేస్తున్నాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా అటవీశాఖ అధికారులు పట్టించుకోలేదని, అందుకే విషప్రయోగం చేశామని నిందితులు చెప్పినట్టు సమాచారం. పులి పాడి పశువుపై దాడి చేసినా, చంపేసినా అటవీశాఖ నుంచి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. కానీ, గడిచిన కొన్ని ఘటనల్లో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం తట్టుకోలేక కోపంతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్టు తెలుస్తున్నది. నిర్లక్ష్యంగా వ్యవహరించి పులుల మృతికి కారణమైన అధికారులపై పూర్తిస్థాయి విచారణ అనంతరం చర్యలు తీసుకోకున్నట్టు ఉన్నతాధికారులు చెప్తున్నారు. దరిగాం గ్రామంతో పాటు సర్కేపల్లి, రెంగరీట్ గ్రామాలకు చెందిన మొత్తం 8 మందిని అనుమానితులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు తప్పు అంగీకరించగా, మిగిలిన ఐదుగురిని ఇంటికి పంపించినట్టు తెలిసింది.

కేంద్ర జల్‌శక్తిశాఖ సమావేశం 17కు వాయిదా

హైదరాబాద్, జనవరి12 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ ఏపీ ఆక్రమణ తదితర అంశాలపై కేంద్ర జల్‌శక్తి సెక్రటరీ నేతృత్వంలో ఈ నెల 15 నిర్వహించ తలపెట్టిన సమావేశం 17కి వాయిదా పడింది. సాగర్ ఘటన, ప్రాజెక్టుల స్వాధీనం, కేఆర్ఎంబీ నిర్వహణకు నిధుల విడుదల అంశాలపై న్యూఢిల్లీలో ప్రత్యేక సమావేశాన్ని 15న నిర్వహించాలని నిర్ణయించింది. అయితే అదేరోజు పండుగ ఉన్న నేపథ్యంలో ఇరు రాష్ట్రాలు కూడా విముఖత చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో సమావేశం 17కి వాయిదా వేసినట్టు తెలిసింది.

శాశ్వత పరిష్కారానికే కొత్త మార్గదర్శకాలు

- పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అతిక్రమించలేదు
- కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం అఫిడవిట్

హైదరాబాద్, జనవరి12 (నమస్తే తెలంగాణ): కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణ, ఏపీ మధ్య వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతోనే కొత్త మార్గదర్శకాలను జారీచేశామని, ఆ అధికారం తమకు ఉన్నదని కేంద్రం స్పష్టంచేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టుకు శుక్రవారం నివేదించింది. కొత్త టీవోఆర్ ఎక్కడా రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అతిక్రమించలేదని వెల్లడించింది. ఏపీ పునర్విభజన చట్టం 2014 సెక్షన్ 89 మార్గదర్శకాల మేరకు కాకుండా అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం 1956 సెక్షన్ 3 ప్రకారం కృష్ణా జలాలను పంచాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ఫిర్యాదుపై ట్రిబ్యునల్- 2(కేడబ్ల్యూడీటీ)కు కేంద్రం నూతన మార్గదర్శకాలను జారీచేసిన విషయం తెలిసిందే. అయితే కేంద్రం జారీ చేసిన నూతన మార్గదర్శకాలపై అభ్యంతరాలను తెలుపుతూ ఏపీ సర్కారు సుప్రీంలో పిటిషన్ దాఖలు చేసింది. ట్రిబ్యునల్ విచారణను వాయిదా వేయాలని, కొత్త టీవోఆర్ చెల్లబోదని, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టానికి అది విరుద్ధమని వాదనలు వినిపించింది. దీనిపై కౌంటర్ వేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం కేంద్రం తన అఫిడవిట్‌ను దాఖలు చేసింది. కేంద్రం ఇచ్చిన అఫిడవిట్‌పై వాదనలను వినిపించేందుకు ఏపీ రెండు వారాల గడువును కోరగా, అందుకు సుప్రీంకోర్టు అనుమతిస్తూ విచారణను వాయిదా వేసింది.

ట్రక్కు డ్రైవర్ల సమ్మెతో పత్తి కొనుగోళ్లు నిలిపివేత

- 8 గంటలపాటు మార్కెట్‌లో పడిగాపులు
- ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో రైతుల నిరసన
- అధికారుల జోక్యంతో కొనుగోళ్లు మొదలు

ఆదిలాబాద్ మార్కెట్ యార్డు లోపల నిలిచిపోయిన వాహనాలు

ఆదిలాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): ట్రక్కు డ్రైవర్ల సమ్మె కారణంగా ఆదిలాబాద్‌లో శుక్రవారం పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఫలితంగా రైతులు ఎనిమిది గంటల పాటు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరుగుతుండగా శుక్రవారం ఉదయం జిల్లాలోని ఆదిలాబాద్ రూరల్, జైనథ్, బేల, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పత్తిని తీసుకువచ్చారు. ఉదయం 5 నుంచి 10 గంటల వరకు 400 వరకు వాహనాలు వచ్చాయి. సీసీఐ అధికారులు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన పత్తిని బేళ్లుగా మార్చడానికి జిల్లా కేంద్రంలోని 18 జిన్నింగ్‌లను లీజుకు తీసుకున్నారు. ట్రక్కు డ్రైవర్ల సమ్మె కారణంగా జిన్నింగ్ మిల్లులో పత్తి బేళ్ల రవాణా నిలిచిపోయింది. దీంతో కొనుగోలు చేసిన పత్తిని నిల్వ చేసుకునేందుకు స్థలం లేకపోవడంతో జిన్నింగ్ యజమానులు సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని తమ మిల్లుల్లోకి అనుమతించలేదు. ఫలితంగా సీసీఐ అధికారులు కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో పత్తిలోడ్‌తో వచ్చిన వాహనాలు మార్కెట్‌యార్డు లోపల, బయట ఆగిపోయాయి. వందలాది మంది రైతులు పత్తి కొనుగోళ్ల కోసం 8 గంటల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొనుగోళ్లు నిలిపివేతను నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్టుట్టు ముందస్తు సమాచారమిస్తే తాము పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చేవాళ్లం కాదని అధికారులను నిలదీశారు. పత్తి కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయల్‌శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ ఉమేందర్ మార్కెట్‌యార్డుకు చేరుకొని జిన్నింగ్ వ్యాపారులు, లారీల యజమానులతో చర్చలు జరిపారు. జిన్నింగ్‌లో ఉన్న పత్తి బేళ్లను రవాణా చేయడానికి లారీ యజమానులు ఒప్పుకోవడంతో మధ్యాహ్నం ఒంటి గంటకు పత్తి కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి.

'యాదాద్రి' ఇంత జాప్యమా!

- పెండింగ్‌లో ఉండటానికి కారణాలేంటి?
- అధికారులపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం
- సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశం
- అనుమతులొస్తే డిసెంబర్ నాటికి నాలుగు యూనిట్లు
- 2025 మే నాటికి మరో యూనిట్ పూర్తిచేస్తాం: బీహెచ్ఈఎల్

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రం నిర్మాణంలో జాప్యం ఎందుకవుతున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. జాప్యానికి కారకులెవరని అధికారులను నిలదీశారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన ఇంధన శాఖ కార్యదర్శి రిజ్వీతో కలిసి బీహెచ్ఈఎల్ అధికారులతో యాదాద్రి పవర్ ప్లాంట్‌పై పనులను సమీక్షించారు. ఒప్పందం ప్రకారం 2020 అక్టోబర్ నాటికి రెండు యూనిట్లు, 2021 అక్టోబర్ నాటికి మరో మూడు యూనిట్లు పూర్తి చేసి 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి ప్రారంభించాల్సి ఉండగా, ఇప్పటివరకు పెండింగ్‌లో ఉండటానికి కారణాలేమిటని ప్రశ్నించారు. కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానంలో టెండర్లను ఆహ్వానించకుండా నామినేషన్ పద్ధతిలో బీహెచ్ఈఎల్‌కు ఎందుకు అప్పగించారని ఆరా తీశారు. ఈ ప్లాంట్ నిర్మాణానికి జెన్‌కో రూపొందించిన అంచనాలు, బీహెచ్ఈఎల్ కోట్ చేసిన రేటు, ధరల విషయంలో బీహెచ్ఈఎల్‌తో జరిగిన సంప్రదింపులు, ఒప్పందం విలువ వంటి అంశాలతో కూడిన సమగ్ర నివేదిక సమర్పించాలని ఇంధన శాఖ కార్యదర్శిని ఆదేశించారు. పర్యావరణ అనుమతులను ఏప్రిల్ నాటికి వస్తే.. సెప్టెంబర్ వరకు రెండు యూనిట్లు, డిసెంబర్ నాటికి మరో రెండు యూనిట్లు ప్రారంభిస్తామని, 2025 మే నాటికి మిగిలిన ఒక యూనిట్‌ను పూర్తి చేసి విద్యుత్తు ఉత్పత్తి మొదలుపెడుతామని బీహెచ్ఈఎల్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో బీహెచ్ఈఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కొప్పు సదా శివమూర్తి, డైరెక్టర్ తజీందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పనులన్నీ ఎందుకు పూర్తికాలేదు?

యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి రూ.34,500 కోట్ల అంచనాతో 2015 జూన్ 6న బీహెచ్ఈఎల్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకొన్నది. 2017 అక్టోబర్‌లో వర్క్ ఆర్డర్ జారీ చేశారని, ఈ అగ్రిమెంట్ ప్రకారం 2021 నాటికి పనులన్నీ ఎందుకు పూర్తి కాలేదని భట్టి ప్రశ్నించారు. ఆలస్యానికి కారణాలను వివరిస్తూ సకాలంలో తమకు బిల్లులు చెల్లించలేదని బీహెచ్ఈఎల్ అధికారులు తెలిపారు. పర్యావరణ అనుమతులకు సంబంధించిన ఇబ్బందులు సైతం జాప్యానికి కారణమని పేర్కొన్నారు. రూ.34,500 కోట్ల పనుల్లో బీహెచ్ఈఎల్‌కు అప్పగించిన పనులు విలువ ఎంత? అని మంత్రి ప్రశ్నించగా.. రూ.20,444 కోట్లు అని, మిగిలిన పనులను జెన్‌కో ఇతర సంస్థలు చేపట్టాయని అధికారులు తెలిపారు. తాము రూ.15,860 కోట్ల పనులు పూర్తి చేయగా, రూ.14,400 కోట్ల బిల్లులు చెల్లించారని బీహెచ్ఈఎల్ అధికారులు వెల్లడించారు. రూ.1,167 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

16న జైపాల్‌రెడ్డి జయంతి

హైదరాబాద్, జనవరి12 (నమస్తే తెలంగాణ): కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జయంతిని 16న ప్రభుత్వపరంగా నిర్వహించాలని తెలంగాణ సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. జయంతితోపాటు జూలై 28న ఆయన వర్ధంతిని కూడా అధికారికంగా నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాల్సిందే

- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

నాగర్‌కర్నూల్, జనవరి 12: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాల్సిందేనని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో కూనంనేనిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందే స్పష్టం చేశారు. ప్రజల కోసం సీపీఐ రాజీలేకుండా పనిచేస్తుందని అన్నారు. పేదలకు మంచి చేయాలన్నది తమ పార్టీ సిద్ధాంతమని ఆయన పేర్కొన్నారు.

పందెం కోడి బ్లూక్రాస్‌కు అప్పగింత

- వేలం పాట రద్దు చేసిన ఆర్టీసీ అధికారులు

పందెం కోడిని బ్లూక్రాస్ సంస్థ ప్రతినిధి తూము నారాయణకు అప్పగిస్తున్న ఆర్టీసీ డీఎం

తెలంగాణచౌక్/రుద్రంగి, జనవరి 12: ఆర్టీసీ పందెం కోడి కథ సుఖాంతమైంది. ఈ నెల 9న బస్సులో పందెంకోడి దొరికిన విషయం తెలిసిందే. 3 రోజులపాటు సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణలో ఉన్న కోడిని శుక్రవారం కరీంనగర్ డిపో-2 మేనేజర్ మల్లయ్య ఆధ్వర్యంలో బ్లూక్రాస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తూము నారాయణకు అప్పగించారు. శుక్రవారం కోడిని వేలం వేయాలని అధికారులు మొదట నిర్ణయించారు. కానీ, జంతు సంరక్షణ సంస్థ సభ్యులు కొంత మంది వచ్చి వన్యప్రాణుల చట్టం ప్రకారం కోడిని వేలం వేయరాదని, జంతు సంరక్షణ కేంద్రాలను అప్పగించాలని ఆర్ఎం సుచరిత దృష్టికి తీసుకెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించారు. వెంటనే ఆర్టీసీ అధికారులు ఆ కోడిని బ్లూక్రాస్ సొసైటీకి అప్పగించారు. అప్పటికే వేలం ప్రకటన చూసి పలువురు డిపో-2కు చేరుకున్నారు. బ్రీడింగ్ కోసం పందెం కోడిని దక్కించుకునేందుకు రామకృష్ణ అనే వ్యక్తి మహాదేవపూర్ నుంచి వచ్చారు. నగరంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్ల యజమానులు తరలివచ్చారు.

వేలం ఆపండి.. ఆ కోడి నాదే

వేలం ఆపండి ఆ కోడి తనదేనంటూ ఓ వ్యక్తి వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. తన పేరు వల్లపు మహేశ్ అని, తనది ఏపీలోని నెల్లూరు జిల్లా కావలి అని చెప్పారు. ఉపాధి నిమిత్తం రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్టు చెప్పారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో పందెం కోడిని తీసుకొని నెల్లూరుకు వెళ్తుండగా, బస్సులో మరిచిపోయానని, దయచేసి వేలం ఆపాలని, ఆ కోడి తనదేనని, ఆధారాలు ఉన్నాయంటూ కోరిన వీడియో వైరల్‌గా మారింది.

యువతి మృతిపై వీడిన మిస్టరీ

- ఆత్మహత్యగా తేల్చిన పోలీసులు
- స్నేహితుల మధ్య ఎడబాటే కారణం

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 12 (నమస్తే తెలంగాణ): మొయినాబాద్‌లో యువతి అనుమానాస్పద మృతి మిస్టరీ వీడింది. మృతురాలిని పాతబస్తీ మల్లేపల్లికి చెందిన తహ్సీన్‌బేగంగా గుర్తించిన పోలీసులు.. ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు తేల్చారు. రాజేంద్రనగర్ అదనపు డీసీపీ రష్మీ పెరుమాల్ కథనం ప్రకారం.. మెహిదీపట్నంలోని మదీనా కాలేజీలో డిగ్రీ పూర్తిచేసిన తహ్సీన్‌బేగం (22) కు తన క్లాస్‌మేట్ అయిన మరో యువతితో స్నేహం ఏర్పడింది. చాలా సన్నిహితంగా ఉండే వీరిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో కొన్ని రోజులుగా ఒకరికొకరు దూరంగా ఉంటున్నారు. వీరు సన్నిహితంగా ఉండేందుకు కుటుంబీకులు అంగీకరించలేదు. దీంతో స్నేహితురాలి ఎడబాటును తట్టుకోలేని తహ్సీన్‌బేగం తనువు చాలించాలని నిర్ణయించుకున్నది. ఈ నెల 8న పెట్రోల్ కొనుగోలు చేసింది. అదే రోజు ఉదయం 11.30కు మల్లేపల్లి నుంచి మురాద్‌నగర్, హుమాయూన్‌నగర్ ప్రాంతాల్లోని స్నేహితుల వద్దకు వెళ్లింది. అనంతరం అదే ఆటోలో మొయినాబాద్ డ్రీమ్‌వ్యాలీకి చేరుకుని.. వెంట తెచ్చుకున్న పెట్రోల్ తో ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

జర్మన్ పాస్‌పోర